క్లుప్తంగా

చట్టాలపై అవగాహన



అనుమసముద్రంపేట: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సైదులు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలు, పోక్సో కేసుపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థినులు సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు.

ప్రత్యేక ఆధార్ శిబిరం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కిస్తీపురం పంచాయతీ పరిధిలోని చింతలపాళెంలో ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు.ఆరేళ్లలోపు చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఆధార్ నమోదు చేశారు. గతంలో ఆధార్ తీసుకుని పోగొట్టుకున్న వారికి ప్రత్యేకంగా ఆధార్ పొందే అవకాశం కల్పించారు. ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి విజయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త బీ పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్‌గా వీరాస్వామి



బచ్చు వీరాస్వామి

కావలి (జలదంకి): కావలిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ ఆర్యవైశ్య నేత బచ్చు వీరాస్వామి ఎన్నికయ్యారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో వీరాస్వామిని అధ్యక్షుడిగా ఆలయ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కావలి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తటవర్తి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, వాసవి సెవెన్ లయన్స్ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వీరాస్వామిని అభినందించారు.

వైభవంగా గంధ మహోత్సవం



ఉదయగిరి రూరల్: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలోని హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా దర్గాలో గంధ మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. సాయంత్రం దర్గా కమిటీ చదివింపుల కార్యక్రమం నిర్వహించారు. రాత్రి హక్కుదారుల ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

3,4 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



ఆత్మకూరురూరల్: ఆగస్టు 3, 4 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం 26వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు. ఆత్మకూరులోని రవితేజ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఆత్మకూరు నియోజకవర్గ మహాసభలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 22, 23, 24 తేదీల్లో రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆత్మకూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తొలుత పట్టణంలోని ఎంజీఆర్ బస్టాండ్ నుంచి రవితేజ కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కోపూరి మాలకొండయ్య, గిరిజన రాష్ట్ర సంక్షేమ సంఘం నాయకులు డీఎల్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కావలి (జలదంకి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కావలి సబ్‌కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ అన్నారు. కావలిలోని సబ్‌కోర్టు కార్యాలయం ఎదురుగా బుధవారం ఆయన మొక్కలు నాటారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృదుల, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, విశ్రాంత కోర్టు ఉద్యోగి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌పై అవగాహన

జలదంకి: మండల విద్యా వనరుల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఈఓ నాగేశ్వరరావు ఓపెన్ స్కూల్‌పై హెచ్ఎంలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఓపెన్ స్కూల్ బ్రోచర్లను విడుదల చేశారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మసూద్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

నమ్మించి వంచించడం చంద్రబాబు నైజం

- ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



దుత్తలూరు: రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి



వరికుంటపాడులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేకపాటి

దుత్తలూరు/వరికుంటపాడు: నమ్మించి వంచించడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బాబు షూరిటీ–మోసం గ్యారెంటీపై దుత్తలూరు, వరికుంటపాడులో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుపై 143 హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సూపర్‌సిక్ హామీల్లో ఇంత వరకు ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. మంత్రి అచ్చెంనాయుడు ఆడబిడ్డ నిధిని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సిందేనని చెప్పడం ద్వారా ఆడపడుచులను వంచించారన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించకుండానే ఇప్పటికే రూ.1.86 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. ప్రజలను హామీల పేరుతో నమ్మించే నైజం చంద్రబాబుది కాగా..ఇచ్చిన మాటకు కట్టుబడే తత్వం వైఎస్ కుటుంబానిదేనన్నారు. ఐఏఎస్ అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డమైన పనులు చేయిస్తూ వారి మనోస్థైర్యాన్ని సైతం దెబ్బతీస్తున్న ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్న పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వ అన్యాయాలు, అక్రమాలపై నోరుమెదపడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలను ప్రశ్నించకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని, ఓపికతో సంయమనం పాటించాలన్నారు. 2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. బాబు పాలనలో మోసం గ్యారెంటీ అని ప్రజలకు అర్థమైందన్నారు. ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీ వైపే చూస్తున్నారని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి నేతకు, కార్యకర్తకు అండగా ఉంటామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన ప్రాధాన్యత, గుర్తింపు ఇస్తామన్నారు. అనంతరం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో దుత్తలూరు, వరికుంటపాడు మండలాధ్యక్షులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎం తిరుపతినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లాల కొండారెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంశీకృష్ణ, రాష్ట్ర కల్చరల్ విభాగం జనరల్ సెక్రటరీ కండ్లకుంట వెంకటరెడ్డి, సర్పంచ్‌లు యనమల సుబ్బమ్మ, మీసాల సుబ్బరాయుడు, తిప్పిపోయిన వెంగయ్య, రామిరెడ్డి కొండారెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు మాగంటి సిద్దయ్య, మానం మస్తానయ్య, చెంచిరెడ్డి, జక్కం శ్రీనివాసులురెడ్డి, బీ వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున, యర్రా ఓబయ్య, బత్తిన కొండమ్మ, మధు, చెన్నారాయుడు, తుమ్మల వెంగయ్య చౌదరి, ఎల్చీ కొండారెడ్డి, బేబీ సురేఖ, మండ్ల శ్రీనివాసులు, రంగయ్య నాయుడు, నాగార్జున, పెద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రామకష్టారెడ్డి, కంభం మురళీమోహన్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, కాలేషా, వెంగల్‌రెడ్డి, శ్రీహరి నాయుడు, నాగేశ్వరరావు, చెన్నకేశవులు, గోవిందు, అంకినపల్లి నరసింహారెడ్డి, చుండి నక్క మోహన్, రమణయ్య, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

వరికుంటపాడు మండలం వేంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చెనికల ఆవులయ్యను మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు.మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న ఆవులయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన శ్రీనివాసరెడ్డి

బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కొండాపురం, వింజమూరులో జరిగిన సమావేశాల్లో వింజమూరు మండలం కాటేపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డి, కొండాపురం మండలం వెలిగండ్లకు చెందిన రమేష్ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం నేడు

ఉదయగిరి: పట్టణంలోని శోభాకాంప్లెక్స్‌లోని మినీ ఫంక్షన్ హాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. మండలంలోని నాయకులు,, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

లేగదూడలకు అందాల పోటీలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం లెక్కలవారిపాళెంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడలకు అందాల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి పశుసంవర్థక శాఖ సంచాలకులు ఎస్ మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ రైతుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు గోజాతుల అభివృద్ధి, సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పశువులను ఆరోగ్యకరంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పాల ఉత్పత్తి పెంపుదల దేశీయ గోజాతులతోనే సాధ్యమన్నారు.అనంతరం లేగదూడలకు అందాల పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన లేగదూడల యజమానులకు బహుమతులు అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ జీవ సంచాలకులు బీ శ్రీనివాసరావు, ఆత్మకూరు, వింజమూరు ఏడీలు సీ వెంకటేశ్వరరెడ్డి, కే రఘునాథ్,తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్సీపీ నేతలు

మర్రిపాడు: ఎన్నికల సమయంలో హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, హామీలపై ఎవరూ ప్రశ్నించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో మర్రిపాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు జగన్‌మోహన్‌రెడ్డి కంటే అధికంగా సంక్షేమాన్ని అందిస్తామని ఊదరగొట్టారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు పెడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఈ నెల 28న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై ఆత్మకూరు నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు చెన్ను వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు గంగవరపు శ్రీనివాసులునాయుడు, రాష్ట్ర పబ్లిసిటి వింగ్ కార్యదర్శి బొర్రా సుబ్బిరెడ్డి, జిల్లా యాక్టివిస్టు సెక్రటరీ చిట్టెం శ్రీనివాసులు, నాయకులు కొండారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నారాయణస్వామి, ఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణు, రామకృష్ణ, సత్యం , ఖాన్‌సా, అశోక్ రెడ్డి, కొండారెడ్డి, నాగరాజు, పద్మారెడ్డి సుధాకర్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పోలీసులకు కిట్ల పంపిణీ



కావలి (జలదంకి) : కావలిలోని డీఎస్పీ కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు, కానిస్టేబుళ్లకు యూనిఫామ్‌లు, కళ్ల అద్దాలు, టోపీలు, గ్లౌజులతో కూడిన కిట్లను బుధవారం పంపిణీ చేశారు. కావలి డీఎస్పీ శ్రీధర్ చేతుల మీదుగా కిట్లను అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజాసేవలో నిరంతరం కష్టపడే పోలీసులకు కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు పోలీసు శాఖ తరపున కావలి ఆర్యవైశ్య సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ త్వరలో పోలీస్ సిబ్బందికి రెయిన్‌కోట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఒకటో, రెండో పట్టణ సీఐలు ఫిరోజ్, గిరిబాబు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సోమశిల: అనంతసాగరం మండలం దేవరాయపల్లి బిట్-1 పంచాయతీ ఎంపీయూపీ, ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం సత్యాల డానియేల్, ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాల హెచ్ఎం ఎస్‌కె ఇస్మాయిల్‌జబివుల్లా ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ

దుత్తలూరు: మండలంలోని భైరవరంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆలూరి వెంగళరెడ్డి ఉత్తరక్రియలకు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వెంగళరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నువాడలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు నారాయణ ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. స్థానిక నాయకులు ఏలూరి కిరణ్, మాధవ, నరసింహ, పసుపులేటి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

ఉదయగిరి: ఉపాధి హామీ పథకం సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. క్లస్టర్ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద 790 ఎకరాల పండ్ల తోటల సాగు చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 249 ఎకరాలకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి చైతన్యపరచాలన్నారు. ఏపీఓ అజాంఖాన్, ఈసీ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



అనుమసముద్రంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

అనుమసముద్రంపేట/సంగం: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చయ్య కోరారు. ఈ మేరకు సంగం మండల వీఆర్‌ఏలతో కలిసి తహసీల్దార్ సోమ్లానాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద సామూహిక రాయబార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వీఆర్‌ఏలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే అనుమసముద్రంపేట వీఆర్‌ఏలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

అనధికార లేఅవుట్లపై కొరడా

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అనధికార లేఅవుట్లపై మున్సిపల్ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. బైపాస్‌రోడ్డు, జేఆర్‌పేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్లలోని డ్రెయిన్లు, అంతర్గత రోడ్లను తొలగించారు. లేఅవుట్లను ఏర్పాటు చేసిన వారికి నోటీసులు ఇచ్చినా అనుమతి పత్రాలను చూపకపోవడంతో తొలగింపులు చేస్తున్నట్లు వారు తెలిపారు.

చిన్నతరహా నీటి వనరుల గణన ప్రారంభం

మర్రిపాడు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఏడో చిన్న తరహా నీటి వనరుల గణన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీలోగా గ్రామాల్లోని నీటి వనరుల వివరాలను సేకరించి యాప్‌లో పొందుపరచనున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకులతో రామిరెడ్డి సమావేశం



కావలి (జలదంకి): కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిలోని తన నివాసంలో పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. కావలి నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలపై నాయకులతో చర్చించారు.

అచ్యుతానందన్‌కు నివాళి

కావలి (జలదంకి) : కావలిలోని శివరామసుబ్బయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్‌కు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు పీ సీతారామయ్య, రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తాళ్లూరి మాల్యాద్రి, తదితరులు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డీసీపల్లిలో 422 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 422 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 837 బేళ్లు రాగా, 422 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.159, సగటున రూ.195.63 ధర పలికిందని వివరించారు.

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు సగటు ధర రూ. 205 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 467 బేళ్లను తీసుకురాగా, 255 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160,సగటున రూ. 205.75 లభించిందని వివరించారు.

రైతులకు వీఏఏలు అందుబాటులో ఉండాలి

ఉదయగిరి రూరల్: గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) రైతులకు అందుబాటులో ఉండాలని ఏడీఏ జీ లక్ష్మీమాధవి అన్నారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో ఉదయగిరి డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ, మట్టి నమూనాలు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఓలు చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి, కవిత, మాధవ, సునీల్, ఏఈఓలు సుధీర్, వినోద్, సుస్మిత, సాంబశివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ

సోమశిల: ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నామని మండల ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్ తెలిపారు. అనంతసాగరం మండలం బొమ్మవరం, అగ్రహారం, చిలకలమర్రిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేసిన రైతులకు ఎరువుల కోసం నాలుగేళ్ల పాటు ఎకరాకు రూ.2100 చొప్పున నగదు అందజేస్తామని తెలిపారు. బొప్పాయి సాగుకు మల్చింగ్ , డ్రిప్, స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందజేస్తామని వివరించారు. బొప్పాయిలో వైరస్ నివారణకు థయోమీథాక్సం 0.5 గ్రాములు లేదా ఇమిడా క్లోప్రిడ్, ప్రొపెనిల్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ శైలజాకుమారి, విస్తరణాధికారిణి కృష్ణవేణి, వీఏఏలు మల్లికార్జున, ప్రశాంతి పాల్గొన్నారు.

మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

సీతారామపురం : మండలాన్ని ప్రగతిపథంలో నడిపించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులదేనని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలను అరికట్టి కూలీలకు సకాలంలో నగదు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సీతారామపురం బిట్-1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల మండలాధికారులు హాజరయ్యేలా చూడాలని కోరారు. వసతి గృహాల పనితీరు సక్రమంగా లేనందున సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలన్నారు. సుదీర్ఘ సెలవుపై వెళ్లిన ఎంపీడీఓ జనరల్ ఫండ్ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులను గోల్‌మాల్ చేశారన్న ఆరోపణలపై విచారణకు ఆదేశించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ, తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు సారమ్మ, వెంకటసుబ్బమ్మ, సర్పంచ్‌లు భాగ్యమ్మ, వెంకటసుబ్బయ్య, రామచంద్ర, ఎంఈఓ మస్తాన్‌వలి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు షాను, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు హనీనిస్సీ, రామకృష్ణ, చిన్నయ్య, ఏపీఓ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

బోగోలు పంచాయతీ కార్యదర్శిపై విచారణ



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ వెంకటరమణ

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంతో పాటు పంచాయతీ కార్యదర్శిపై పాలకవర్గ సభ్యులు, పంచాయతీ ప్రజలు చేసిన ఫిర్యాదులపై కావలి డీఎల్‌పీఓ వెంకటరమణ బుధవారం విచారణ చేపట్టారు. పంచాయతీలో పనులు చేపట్టకుండానే చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేసి భారీగా నిధులు దుర్వినియోగం చేసినట్లుగా కొద్దిరోజులుగా పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. పంచాయతీ కార్యదర్శిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సమాచారహక్కు చట్టం కింద వివరాలు సేకరించి నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కావలి డీఎల్‌పీఓ వెంకటరమణ పాలవర్గ సభ్యులు, ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, పంచాయతీ ప్రజలు, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రత్యేక పారిశుధ్య పనులు, తాగునీటి వసతి, తదితర పేర్లతో నిధులు దుర్వినియోగం చేయడంతో పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ పేరుతో షామియానాలు, కుర్చీలు, ఇతర ఖర్చులు అంటూ పంచాయతీ నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఇంటిపన్నుల్లో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆధారాలు అందజేశారు. బోగోలుకు చెందిన సాయి అనే వ్యక్తి ఇంటి పన్ను కోసం రూ.5వేలు, రూ.3వేలు, రూ.500 వంతున మూడు విడతలుగా ఫోన్‌పే ద్వారా చెల్లిస్తే కేవలం రూ.3వేలు, రూ.500 నగదుకు మాత్రమే రశీదు ఇచ్చారని, రూ.5వేలకు ఎలాంటి రశీదు ఇవ్వలేదని ఆరోపిస్తూ ఫోన్‌పే స్క్రీన్‌షాట్‌లను విచారణాధికారికి అందజేశారు. విచారణానంతరం కావలి డీఎల్‌పీఓ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ ప్రజలు చేసిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కాగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వీరరఘు మాట్లాడుతూ బోగోలు పంచాయతీలో నిధుల దుర్వినియోగం, కార్యదర్శి అవినీతిపై ఆధారాలను విచారణాధికారికి అందజేశామని, విచారణను పారదర్శకంగా పూర్తిచేసి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. కూటమి నేతల అండతో విచారణను అటకెక్కిస్తే నేరుగా లోకాయుక్తను ఆశ్రయిస్తామన్నారు.

పొదుపు సంఘాలు ఆర్థికంగా బలపడాలి



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసరావు

సీతారామపురం : పొదుపు సంఘాలు ఆర్థికంగా బలపడి అందరికీ ఆదర్శంగా నిలవాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలు, ఎంసీపీ, హెచ్‌ఎల్‌పీ పథకాలు, స్త్రీనిధి, ఉన్నతి, వీవోఎస్‌హెచ్‌ఈ సమావేశాలు, లోకస్ యాప్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం ఉదయగిరి వ్యవసాయ శాఖ ఏడీ శశిధర్ మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాలపై అవగాహన కల్పించారు. యూనిట్‌ను బట్టి అర్హులైన సంఘాలకు బ్యాంకర్లు రూ.10 లక్షల వరకు రుణాలను అందజేస్తారని తెలిపారు. సీసీలు శ్రీనివాసులు, చెన్నకేశవులు, కిష్టయ్య, మరియమ్మ, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

కలిగిరి: వెలగపాడు గ్రామసచివాలయాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం గిరీష్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం అర్హుల జాబితాను ప్రదర్శించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వీఆర్వో రవి, పంచాయతీ కార్యదర్శి తనూజ ఉన్నారు.

ముగిసిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

చేజర్ల(సోమశిల): ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ నిరంతర పోరాటం సాగిస్తోందని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. చేజర్ల మండలంలో రెండు రోజులుగా చేపడుతున్న యూటీఎఫ్ సభ్యత్వ నమోదు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కాలువలోకి దూసుకెళ్లిన బైక్

- యువకుడికి తీవ్ర గాయాలు



సంగం: బైక్ అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సంగం–కలిగిరి రోడ్డులో అమ్మా ఆదిపరాశక్తి ఆశ్రమం వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..కలిగిరి వైపు నుంచి పల్సర్ బైక్‌పై వస్తున్న పవన్ అనే యువకుడు అమ్మా ఆదిపరాశక్తి ఆశ్రమం సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి కాలువలో పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. కాగా యువకుడు మద్యం సేవించి ఉండడంతో ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.